కథా నిలయం
శ్రీకాకుళం

“జంగమా హేమవల్లీ”

బొటానిస్టు ఆర్. ఆర్. మల్లా ఉన్నట్టుండి ఒక్కసారి గట్టిగా నవ్వేశాడు, విజయసూచకంగా.

“ప్రకృతిమీద మొదటి విజయం సాధించాను, లతా.” నవ్వుకు కారణం తెలుసుకోటానికి తలెత్తిచూసిన లత కారణం తెలుసుకునికూడా, ఏమీ అర్థం కానట్టుగానో, అర్థమైనాకూడా తెలుసుకున్న విషయంలో అభిరుచి లేనట్టుగానో చూస్తూనేఉంది అతనివైపు.

“పట్టుదల ఉండాలేగాని ప్రకృతి రహస్యాలు మనుషులకి పట్టుబడకపోవు. ఏమంటావు, లతా?” తల నిలువుగా ఆడించింది లత కళ్ళప్పగించి చూస్తూనే.

“రెండు సంవత్సరాలనించీ చేస్తున్న పరిశోధన ఇవాళ ఫలించింది.”

ఆర్. ఆర్. మళ్ళా ఉత్సాహంతో చేతుల్లోని నెగటివ్ రీలువైపు తృప్తిగా చూస్తూ అన్నాడు.

ఈ విషయంలో లత ఏమీ ఉత్సాహం చూపించ లేదు. ఆ విషయం బొటానిస్టు గమనించే పరిస్థితిలో లేడు.

"ఈ పరిశోధనల గొడవ అయినట్టేనా ఇవాళ్టితో?"

"మొక్కల పెరుగుదలని గురించి అమూల్యమైన విష యాలు కనిపెట్టబోతున్నాను. ఇంకా కొన్ని ఫోటోలు తీస్తే ఒక అధ్యాయం ముగిసినట్టే."

సరిగా ఊహించినట్టే వొచ్చింది జవాబు. ఒక అధ్యాయమట!

"సాయంత్రంలోపల ఇంకా కొన్ని ఫోటోలు తయారు కావాలి. అవి ఐతే కాని నా పరిశోధనలో మొదటిభాగం పూర్తికాదు. ఇంతవరకు ఫలితాలు నాకు అనుగుణంగానే ఉన్నాయి. పరిశోధన తప్పక అనుకూలంగానే పరిణమిస్తుం దని నాకు గట్టి నమ్మకం ఉంది."

కేమెరా సర్దుతూ తన ధోరణిలో చెప్పుకుపోతున్నాడు బొటానిస్టు. ఆ మాటలు ఎవరూ వినటంలేదని అతనికేం తెలుసు!

"జీవితమంతా ఈ లేబరేటరీలోనేనా గడపటం?" చిరాకు, కోపం, అసహనం, నిస్పృహ అన్నీ ప్రతిబింబించేలా అంది లత.

సమాధానం చెప్పటం అనవసరం అనుకొని బొటానిస్టు చిన్నగా నవ్వాడు.

"పెళ్ళి కాగానే ఇంగ్లండు ప్రయాణం, ఇంగ్లండు నించి రాగానే ఈ లేబరేటరీ—బాగానే ఉంది. తిండీ, ఉద్యోగం, పడకా అన్నీ ఇక్కడే. ఇంట్లో మనుషులున్నా రనిగాని, కాస్త మాటామంచీ అడగాలనిగానీ ఏమైనా ఉంటేనా? ఈ మొక్కల్లో ఒక మొక్కల్లే బతకటం నాచేత కాదు", తీక్షణంగా అంది లత.

"లతా, నీపేరులో మొదటి రెండు అక్షరాలు ఎందుకు కొట్టేశానని నీ అభిప్రాయం?"

ఆమె చిరాగ్గా చూసిం దతనివైపు.

"భూమినించి పైకి వొచ్చింది మొదలు సుకుమార మైన లత చిన్న చిన్న ఆకులు తొడుగుతూ అందంగా మనో హరంగా ప్రతినిత్యమూ పెరుగుతూ చక్కని పూలు పూస్తుంది. ఈ క్రమవికాసం లత కెలా వొస్తుందో అలా నా 'స్వర్ణలత'కీ రావాలి. స్వర్ణలత పెరగదు. అందుకనే మొదటి రెండక్షరాలూ తీసేశాను."

ఆర్. ఆర్. మళ్లా ప్రతిభావంతమైన తన ఉపన్యాసా నికి తనలోనే గర్వపడి మళ్ళీ కొనసాగించాడు.

"అసలు విజ్ఞానం అంటే ఏమిటి? ప్రకృతి రహస్యాలు తెలుసుకోటం. అలా తెలుసుకునేలా చేయగలిగిందే విద్య. ప్రకృతి రహస్యాలు తెలుసుకోటానికి నేను ప్రకృతిలో లీనమైపోతున్నాను. ప్రకృతిలో సంపూర్ణంగా లీనం కాగలి గిననాడే ప్రకృతిని నేను అర్థం చేసుకోగలను. ఉన్న ఆస్తంతా అమ్మి ఈ బొటానికల్ గార్డెన్స్ వేసిందీ, ఈ లేబరేటరీ

కట్టిందీ పిచ్చిపట్టే అనుకున్నావా ? లతా, నీ చుట్టూవున్న ప్రకృతిలో నువ్వుకూడా ఐక్యమై ప్రకృతిని ఆరాధించకలిగితే నువ్వు నన్ను అర్థంచేసుకోగలవు. నిన్ను నువ్వు అర్థంచేసుకోగలవు. నాకు సహాయం చెయ్యగలవు. విలువైనకాలాన్ని సరిగా వినియోగించుకోగలవు. నీకు లభ్యం కావలసిన మానసిక క్రమవికాసం ఇదే. నువ్వు చదువుకున్నదానివే. ఇంతగా నీకు విప్పి చెప్పాలిసిన అవసరంలేదు. నువ్వు దారిలోనే ఉన్నావని నే నిన్నాళ్ళూ అనుకుంటున్నాను. మొక్కలలో మొక్కల్లే బతకటం నీ కిష్టం లేదన్నావు. ఈ ఒక్కొక్క మొక్క నాకెంత ప్రియతమో నువ్వు అంతే. నీతో సరిగా మాట్లాడటంలేదని కదూ నువ్వనటం? ఈ మొక్కలతో నే నెప్పుడూ మాట్లాడలేకపోయినా, ప్రతిక్షణం మాట్లాడుతూనే ఉంటాను. ఈ వాక్యం బాగా అర్థంచేసుకో. నామీద నీకున్న కోపం అంతా ఎగిరిపోతుంది."

ఆమె కోపమంతా ఎగిరిపోక తప్పదనే దృఢవిశ్వాసం వల్ల, తన ఉపన్యాసం ఆమెలో కలిగించిన మార్పు తెలుసుకోటంకోసం ఆమె ముఖభంగిమలు కనిపెట్టటం అనవసరమనుకుని బొటానిస్టు మైక్రోస్కోపుమీదికి వంగి దృష్టిసారించాడు. ఉపన్యాసం కలిగించిన నిస్పృహకి అతని నిర్లక్ష్యంతోడైనందువల్ల లత ముఖం కోపంతో మరింత ఎర్రబడ్డది.

మరికాసేపటకి పని ముగించుకుని చేతులు కడుక్కుంటూ అన్నాడు బొటానిస్టు.

"అలా బొటానికల్ జర్నల్ ఎడిటర్ దగ్గిరి కెళ్లొస్తాను. ఈ పరిశోధన పూర్తికాగానే వ్యాసం రాసి ప్రకటించాలి.

అంతర్జాతీయకీర్తికి ఇదే మొదటి మెట్టు. బహుశా సాయంత్రం ఆలస్యంగా వస్తానేమో. ఈ విషయం ఎడిటర్‌తో బాగా చర్చించాలి."

మాట్లాడటం సరిగా పూర్తి కాకుండానే గుమ్మందాటి వెళ్లాడు, ఆర్. ఆర్. మర్లా. అతడు వెళ్ళినవైపే అలానే కాసేపు చూసింది లత. అంతర్జాతీయ కీర్తి! మొక్కలూ, వ్యాసాలూ, కీర్తి! ఇంతకంటె ఈయనకేం అక్కర్లేదల్లే ఉంది. రాత్రింబగళ్ళూ ఇదే ధ్యాస. మనిషిలో ఇంత స్వార్థం ఎలా కరుడు గట్టుకు పోతూంది! విసుగ్గా చుట్టూ చూసింది లత ఎమీ తోచక. చుట్టూరకరకాల చిన్నచిన్న మొక్కలు. వాటి పెరుగుదల గురించి పరిశోధనలు! అవి ఎలా పెరిగితే ఎవడిక్కావాలి? పైగా పెద్ద పెద్ద మాటలు. ప్రకృతీ, ఐక్యం! ఆ మొక్కల్ని చూస్తే ఎక్కడలేని అసహ్యం వేసిందామెకి. తల తిప్పింది. కేమెరా, మైక్రోస్కోపూ, ట్యూబులూ, మట్టి, మశానం. వొళ్ళు మండింది లతకి. వాటిల్లో ఏ ఒక్క వస్తువూ ఉపయోగించటం తనకి చేతకాదు. అవన్నీ తనని వెక్కిరిస్తున్నాయి. వాటిమీద తన భర్తకి ఎంత అధికారముందో తనకీ అంత ఉంది. అవి ఆయనకి లోకువ. తనకికాదు.

లతకి తటాలున ఓ వింత తలపు కలిగింది. తన భర్తకి తనకంటె అవే ఎక్కువ ప్రియమైనవి. ఆ కేమెరా, ఆ మైక్రోస్కోపు, ప్రాణంలేని ఆ పదార్థాలు తనవైపు చూసి హేళనగా, ఈసడింపుగా నవ్వుతున్నాయి. దుర్భరం. సహించలేని ఆ మానసిక వేదనతో లత తటాలున శోషానించి లేచి

కోపావేశంతో స్టాండుతోసహా ఆ కేమెరాని ఎత్తి కింపపడ వేయబోయింది. కాని ఆ చర్యలోని బుద్ధిమాంద్యం వెంటనే గ్రహింపుకి రావటంవల్ల తన ప్రవర్తనకి సిగ్గుపడి కేమెరా దించేసింది. ఏదో నిస్సహాయత, ఏదో అశాంతి, అర్థంకాని అలజడితో మళ్లీ సోఫాలో చతికిలబడి కళ్లుమూసు కుందామె.

తల ఎవరో నిమిరారు.

కళ్లు తెరిచి చూసింది లత. అప్రతిభురాలైంది. ఎదురుగా రంగారావు చిరునవ్వు నవ్వుతూ నుంచున్నాడు. తన భర్త ప్రియస్నేహితుడు. ఎంత ధైర్యం చేశాడు! ఏమనాలో, ఏం చెయ్యాలో ఆమెకి చప్పున తోచలేదు.

"నాకు తెలుసు స్వర్ణలతాదేవీ, మీ మానసిక బాధ నా కర్థమవుతుంది. నేను సైకో ఎనలిస్టుని. సైంటిస్ట్ మర్లాకి సున్నితమైన మానవహృదయమేం కోరుతుందో తెలీదు..." ఏమిటో అంటున్నాడు రంగారావు.

పరాయి వ్యక్తి అనుకోకుండా తన తల నిమరటం, తన ప్రవర్తన చూడటం_ ఈరెండు సంఘటనలూ ఒక్కుమ్మ డిగా లత మానసికశక్తులపై విజృంభించి ఆమెని మాట్లాడ కుండా చేశాయి, కొద్దిసేపటివరకూ.

రంగారావు ఆమెవైపు పరకాయించి చూసి తటాలున ఆమెని కౌగలించుకున్నాడు. పోయిన మానసిక శక్తులన్నీ వెంటనే తిరిగి రాగా లత రంగారావుని శక్తి కొద్దీ వెనక్కి తోసేసి, లేచి నుంచుంది. ఆమె నిలువెల్లా కంపింపసాగింది.

కాని ఒక్క మాటకూడా ఆమె పెదవులుదాటి బయటికి రాలేదు.

తన సైకో ఎనాలిసిస్ ఎక్కడ దెబ్బతిందో రంగా రావుకి సరిగా బోధపడలేదు.

"క్షమించండి", గొణిగాడు.

లత తెలివితేటలన్నీ ఏమయ్యాయోగాని, అతనివైపు చురచుర చూడటం తప్ప ఆమె ఏమీ అనలేదు. అంచేత ఆమె ప్రవర్తన బెట్టుగా భావించి రంగారావు ఆమెని మళ్లీ చేరబోటం, అతని చెంప చెళ్లుమనటం ఒకేసారి జరిగాయి.

మన సత్వశాస్త్రంమీద మరో కొత్త పుస్తకం తాజాగా వెలువడిందేమో ననిపించింది రంగారావుకి.

"పొరపాటు...నా ఉద్దేశం...క్షమించండి, అదికాదు", నత్తిగా ఏదో గొణిగి వెనక్కిపోయాడు అతడు.

జరిగిన పరాభవం తలుచుకున్న లతకి కళ్ళవెంబడి నీళ్లు తిరిగాయి. అలా ఎంతసేపు కూచుందో ఆమెకి తెలియలేదు.

"ఎడిటర్ అదిరిపోయాడంటే నమ్మ, లతా!" అకస్మాత్తుగా వినవచ్చిన ఈ మాటలకు లత తలెత్తి చూసింది. బొటానిస్టు, ఆర్. ఆర్. మల్లా అత్యుత్సాహంగా ఉన్నాడు.

"'బొటానికల్ వరల్డులో మీపేరు చిరస్థాయిగా ఉంటుందండీ', అన్నాడు ఎడిటర్. చిత్తయిపోయినాడుపాపం." లత అతని మాటలు విన్నది. కాని ఆమె ఏమీ ఉత్సాహం చూపించలేదు. మాటలు చెప్పుకుపోవటమే అతని వంతు

గాని అవి ఎవరైనా వింటున్నారో లేదో, ఆ బొటానిస్టు కనవసరం.

"ఈ ఫోటోగ్రాఫుల గొడవ అయిపోయిందంటే ఒక అధ్యాయం అయిపోయినట్టే. కాస్త ఊపిరి పీల్చుకోటానికి వ్యవధానం దొరుకుతూంది."

లత అతనివైపు ఏమీ మాట్లాడకుండా చూస్తూ కూర్చుంది. మళ్లీ మొదలు...అదుగో ఆ కెమేరా ముందు. అంత సంతోషంలో ఉండికూడా కులాసాగా తనతో నాలుగు మాటలు మాట్లాడటానికి విశ్రాంతి లేదు! ఏమిటో ఈయన స్టడీ! మొక్కలూ, పాడూ, అంతకంటె ప్రపంచంలో ఇంకేంలేనట్లు.

డార్కురూమ్‌లోనించి బయటికొచ్చాడు బొటానిస్టు చేతిలో నెగటివ్ ఫిల్ముతో.

"ఇవన్నీ పరిశోధన ఆఖరి దశలో తీసిన ఫోటోలు. పరిశోధన మొత్తం ఫలితం దీనిమీద ఆధారపడి ఉంది. ఫలితం నాకు ముందే తెలుసనుకో. లతా, ఒకసారి ఇలా చూడు. రెండేళ్ళ తపస్సూ ఫలించినపుడు సైంటిస్టు ముఖ భంగిమ ఎలా ఉంటుందో గమనించు. ఇదిగో నెగటివ్ ఫిల్ము చూస్తున్నాను."

లత కేవలం రాతి బొమ్మలా అతనివైపు చూడ సాగింది. అదేమిటి? విజయం సాధించిన సైటింస్టు ముఖం అలాగేనా ఉండేది? ఏమిటది? అలా తన భర్త ముఖం వివర్ణమయిందేం? ఒక్కసారిగా లత హృదయం ముకుళించుకుపోయింది. పరిశోధన ఫలించలేదు కాబోలు, పాపం!

రెండేళ్ళ శ్రమ! అయ్యో! దిగ్భ్రమతో బొటానిస్టు లత ముఖం వైపు చూశాడు. తరవాత త్వరితంగా మళ్లీ డార్కు రూంలోకి వెళ్లిపోయాడు. అతని ముఖం పూర్తిగా వాడి పోయింది.

మరో గంటకి ఆగదినించి బయటికొచ్చాడు అతడు. చేతిలో కొన్ని ఫొటోలున్నాయి.

"సరిగా రాలేదా?" సానుభూతితో అడిగింది లత. అతనేమీ మాట్లాడకుండా ఆమె దగ్గరికి వొచ్చి ఓ ఫొటో అందించాడు.

"బావుంది కదూ?"

ఫొటో చూసి లత స్తంభీభూతురాలైంది. ఆ ఫొటోలో ఉన్నది లత కాదు—స్వర్ణలత!

"ఇదెక్కడిది?"

బొటానిస్టు మాట్లాడకుండా కేమెరావైపు సంజ్ఞ చేశాడు. ఆమెకిదేమీ అర్థంకావడంలేదు.

"ఎప్పుడు తీశారు?"

"నేను తియ్యలేదు."

అయోమయంగా చూసిందామె.

"మరి?"

"నువ్వే తీసుకున్నావు."

"నేనా?"

ఆలోచించటం మానేసింది లత.

కథా నిలయం
శ్రీకాకుళం

"అవును. కేమెరా నీవైపు ఎందుకు తిప్పుతున్నావు?" లత మాట్లాడలేదు. ఏదో నేరం తనమీద రుజువు కాబోతున్నట్టుగా ఫీలయింది.

"దీన్ని గురించేనా నీ ఆలోచన?" బొటానిస్తు ఆమె చేతికో ఫొటో ఇచ్చాడు. అప్రయత్నంగా అందుకుం దామె. ఆ ఫొటోవైపోసారి చూచి చివాలున దానిని నేలమీద పారేసింది. తనతల నిమురుతూ రంగారావు. నీళ్ళతో ఆమె కళ్ళు నిండాయి. అతనివైపు చూడటాని కామె సాహసించ లేదు. ఆమె మనసులో తుపాను చెలరేగింది. ప్రత్యక్షసాక్ష్యం కనపడుతుంటే తను ఏం చెబితే ఏంలాభం? అతనెలా నమ్మగలడు? ఇంతకీ అది ఆటోమాటిక్ కేమెరా అని తనకి ముందే తెలిసి ఉంటే! తనెందుకు కేమెరా పగలగొట్టలేదు? పగలగొట్టే ధైర్యం లేనప్పుడు దాన్ని గురించి తనెందుకు జోక్యం కలిగించుకుంది?

"ఈ ఆటోమాటిక్ కేమెరా ఐదునిమిషాల కోసారి తనంతట తనే ఫొటోలు తీస్తుంది."

తను చేసిన అపరాధం ఏమీలేదని చెప్పాలనుకుంది లత. చెప్పటం చేతకాలేదు.

"ఈ కేమెరా నాకు మహోపకారం చేసింది."

"నేనేమీ తప్పు చెయ్యలేదు," అంది లత, ప్రయత్నపూర్వకంగా ధైర్యంచేసి అతనివైపు చూస్తూ. అతడు ఆమె వైపు తదేక దీక్షతో చూశాడు. ఏమీ అనలేదు. మరో ఫొటో ఆమె చేతికిచ్చాడు. అది గోడమీద ఎత్తుగా తగిలించి

ఉన్న ఒక ఛార్టు ఫొటో. లత కిదేమీ అర్థం కావటంలేదు. అడగటానికి సాహసం చాలటంలేదు.

"కేమెరా పగలకొట్ట దలచుకుని మళ్ళీ ఎందుకు మానేశావు ?"

ఈ మాటలకి పరమాశ్చర్యంతో ఆమె అతని ముఖం వైపు చూసింది. జరిగిందంతా తన భర్త చూశాడా ? అలా అయితే తను బయటపడినట్టే.

"మీకెలా తెలుసు", హీనస్వరంతో అడిగింది.

"ఈ ఫొటోలే సాక్ష్యం."

మళ్ళీ ఆమె ముఖం ముకుళించింది.

"నేనేమీ తప్పు చెయ్యలేదు," మళ్ళీ అందామె.

"ఈ ఫొటోలు చెబుతూనే ఉన్నాయిగా."

ఆమె ముఖం ఎఱ్ఱబడ్డది. వ్యంగ్యం ! చెయ్యని తప్పుకు శిక్ష ! ఆమె కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

మరుక్షణంలో లత ఊహించలేని, ఏ కోశానా ఆశించని సంఘటన జరిగింది. బొటానిస్టు లత చుబుకాన్ని ఎత్తి ఆమె పెదవులని గాఢంగా ముద్దుపెట్టుకున్నాడు.

"కేమెరాకి నువ్వంటే చాలా ప్రీతి. నీకు ఎన్ని ఫొటోలు తీసిందో చూడు", సోఫామీద చేతిలోని ఫొటోలన్నీ గిరవాటువేశాడు. ప్రతి ఫొటోలో దీనత్వం మూర్తీభవించిన లతే ఉంది.

తన భర్త తనని అనుమానించకపోవటానికి కారణం ఆమెకి తెలీలేదు. అడిగింది సూచనగా.

"ఈ ఆటోమాటిక్ కేమెరా ప్రతి ఐదు నిమిషాలకీ ఫొటో తీస్తుందనే విషయం జ్ఞాపకంలేదా?" అన్నాడతను. ఒక క్షణం కనుబొమలు చిట్లించిన లత మరు క్షణం దరహాసం చేసింది.

"కేమెరా పగలగొట్ట బోయానని ఎలా తెలిసింది."

"ఫొటోలు చూశావుగా, ఆ ఛార్టుఫొటో–నేను సైంటిస్టుని. ఎనలైజు చెయ్యటం నా కలవాటు. అంతకుముందు నీ ఫిర్యాదుకీ దీనికీ అవినాభావ సంబంధం ఉందని ఏ మూర్ఖుడైనా గ్రహిస్తాడు."

అతని తెలివికి ప్రప్రథమంగా మనసారా సంతోషించింది స్వర్ణలత–ఆ లేబరేటరీలో నడిచే బంగారు తీగ.

"స్టడీ చేయాలిసిందెవరినో నాకంటే నా కేమెరాకే బాగా తెలుసు", అని నిగర్వంగా ఒప్పుకున్నాడు బాటానిస్టు రామచంద్రరావు మర్లా యం. యస్. సి., (లండన్).